క్లుప్తంగా

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగదు


వడ్లమూరి కృష్ణస్వరూప్

పాయకరావుపేట: రాష్ట్రంలో విపరీతంగా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి, ప్రజలపై మోయలేని భారాన్ని నిలిపివేయాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ రాష్ట్ర ప్రభుత్వానికి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల గృహాలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. గతంలో విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన నిధులు నేటికి ఎన్డీఏ ప్రభుత్వం చెల్లించకపోవడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వృత్తి, పీజీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు హర్షిత ఎంపిక



కోటవురట్ల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు రాజుపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థిని మళ్ల హర్షిత ఎంపికైనట్టు హెచ్ఎం నాని మణిమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా హర్షితకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వరుసగా నాలుగేళ్లుగా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యేంత వరకు ఏడాదికి రూ.12 వేలు వస్తుందన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు


విరాళం అందిస్తున్న శ్రీనివాస్

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన మోదకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి బాపూజీనాయుడు ఆలయ నిర్మాణానికి రూ.10 వేలు అందజేశారు. మామిడిపాలెం గ్రామానికి చెందిన ఉల్లింగల శ్రీనివాస్ రూ.5116 నగదును ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన


విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

పాయకరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై సీఐ జి.అప్పన్న అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, ఆయుధాల పనితీరును వివరించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా విద్యార్థినులు స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. తమ సమస్యలను తల్లిదండ్రులకు కూడా వెంటనే తెలియజేయాలని చెప్పారు.

పీ-4 సర్వేను విజయవంతం చేయాలి


కోటవురట్లలో పీ4 సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: పీ-4 సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి పీ-4 సర్వేపై గురువారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పీ4 సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. కాగా ఈ సర్వేపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాల ఎత్తివేతకు ఈ సర్వే చేస్తున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాసుపత్రి

- యలమంచిలి సీహెచ్‌సీకి అవినీతి జబ్బు
- ప్రసూతి విభాగంలో అడ్డగోలుగా డబ్బుల వసూలు
- సిజేరియన్, సాధారణ ప్రసవం, కు.ని.ఆపరేషన్లకు వేర్వేరు రేట్లు
- డబ్బులివ్వకపోతే సాకులు చెప్పి చికిత్స చేయకుండా వెనక్కి పంపిస్తున్న వైనం



యలమంచిలి 30 పడకల ఆస్పత్రి

యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెంకు చెందిన జ్యోతిని వారం రోజుల క్రితం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించడానికి యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శస్త్ర చికిత్స తర్వాత ఆమె కుటుంబీకుల నుంచి రూ.5 వేలు ఇవ్వాలని వైద్యురాలు అక్కడ పని చేస్తున్న సిబ్బందితో అడిగించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది ద్వారా డాక్టర్‌కు రూ.4 వేలు ఇచ్చారు.

కొద్దినెలల క్రితం ఏటికొప్పాకకు చెందిన బీఎస్ఎఫ్ జవాను భార్యకు నెలలు నిండడంతో ఇక్కడ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మొదట సాధారణ ప్రసవం జరుగుతుందని చెప్పి చివరిలో సిజేరియన్ చేయాలని గర్భిణి కుటుంబీకులను భయపెట్టారు. ఆ తర్వాత ఒక మీడియా ప్రతినిధి వెళ్లి ఆస్పత్రి సిబ్బందిని నిలదీస్తే ఆమెకు సాధారణ ప్రసవం చేశారు.

రెండు వారాల క్రితం కశింకోట మండలం పల్లపు సోమవరం గ్రామానికి చెందిన మహిళ కుమారి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకోవడానికి వెళితే ఆస్పత్రి సిబ్బంది రూ.5 వేలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో రక్తం తక్కువగా ఉందని శస్త్రచికిత్స చేయడానికి కుదరదని మెలిక పెట్టి ఇంటికి పంపించేశారు. చేసేదిలేక ఆ మహిళను కుటుంబ సభ్యులు కోటవురట్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

యలమంచిలి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ప్రసూతి విభాగంలో అడ్డగోలు వసూళ్లకు ఈ ఘటనలు మచ్చుకు మాత్రమే. సిజేరియన్, సాధారణ ప్రసవం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు వేర్వేరు రేట్లు పెట్టి మరీ వసూళ్ల దందా కొనసాగుతోంది.

యలమంచిలి రూరల్: వైద్యో నారాయణ అనే వదానికి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నారు కొందరు వైద్యులు. యలమంచిలి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ప్రసూతి విభాగం వైద్యురాలు, పని చేసే సిబ్బంది కూడా ఇందుకు అతీతం కాదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి ప్రసూతి విభాగానికి వైద్యం కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు, మహిళలు, వారి కుటుంబ సభ్యుల నుంచి ఇక్కడి సిబ్బంది అడ్డగోలుగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఆస్పత్రి వైద్యాధికారి, జిల్లా అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఇదే తరహాలో రోగుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్న విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విచారణ చేపట్టి ఆస్పత్రి ప్రసూతి విభాగం వైద్యాధికారిణిని సస్పెండ్ చేశారు. అయినా తీరు మార్చుకోకుండా యలమంచిలి ఆస్పత్రిలో ఓ గైనకాలజిస్టు తెర వెనుక ఉండి నిర్భయంగా సిబ్బందితో ప్రసూతి విభాగం రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తుండడం గమనార్హం.


యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రసూతి వార్డు

యలమంచిలి ఆస్పత్రికి ప్రతి రోజూ 30 నుంచి 40 మంది వరకు మహిళలు వైద్య పరీక్షల కోసం వస్తుంటారు. నెలలు నిండిన గర్భిణులు కాన్పు కోసం ఆస్పత్రిలో వార్డులో చేరుతుంటారు. వైద్యం కోసం వచ్చే వారిలో అధిక శాతం నిరుపేదలే ఉంటారు. అయినా ఆస్పత్రి సిబ్బంది కాసుల కక్కుర్తితో వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. యలమంచిలి ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమ వసూళ్లలో పైస్థాయి వారికి వాటాలు అందుతుండడం వల్లనే సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ వసూళ్లకు సంబంధించి ఆస్పత్రి పర్యవేక్షకుడ్ని ఎవరైనా ప్రశ్నిస్తే ఎవరి వద్ద డబ్బు వసూలు చేస్తున్నారో వాళ్ల పేర్లు తమకు చెప్పాలని అడుగుతున్నారు. ఒక వేళ ఫలానా వ్యక్తుల నుంచి డబ్బులు అక్రమంగా వసూలు చేశారని చెప్పిన వెంటనే ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలను ఇళ్లకు పంపించి ఫిర్యాదుదారులను డబ్బు ఇచ్చిన విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరిస్తున్నారు. చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చాక, డబ్బు ఇచ్చేశాక ఈ గొడవలెందుకులే అని చాలా మంది రోగులు మిన్నకుండిపోతున్నారు.

వసూళ్లు ఇలా..

యలమంచిలి పట్టణం తులసీనగర్‌లో ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రసూతి విభాగంలో వైద్య సేవలకు రేట్లు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. సిజేరియన్‌కు రూ.5 నుంచి రూ.10 వేలు, సాధారణ ప్రసవానికి రూ.5 వేలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు రూ.3 నుంచి రూ.5 వేలు దండుకుంటున్నారు. సిజేరియన్లు చేస్తే కాస్త ఎక్కువ డబ్బు వస్తుందన్న కక్కుర్తితో సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఉన్న వారిలో కూడా కొందరికి సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

కు.ని. శస్త్ర చికిత్సకు రూ.4వేలు తీసుకున్నారు..



ఇటీవల నా కుమార్తె జ్యోతిని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించడానికి యలమంచిలి సీహెచ్‌సీకి తీసుకెళ్లాను. శస్త్రచికిత్స చేసినందుకు డాక్టర్ గారు రూ.4 వేలు తీసుకున్నారు. మరో రూ.1000 అడిగితే ఇవ్వలేదు. వైద్యం బాగా చేస్తారో లేదోనన్న భయంతో వారు అడిగినంత డబ్బు ఇవ్వక తప్పడంలేదు. ఈ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న నాకు తెలిసిన మరికొంతమంది వద్ద కూడా డబ్బులు తీసుకున్నారు.

– భీశెట్టి రమణ, కొత్తపాలెం

వసూళ్లు చేయవద్దని హెచ్చరించాను



ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పూర్తిగా ఉచితం. ఆస్పత్రి ప్రసూతి విభాగంలో డబ్బులు వసూళ్లు చేయవద్దని హెచ్చరించాను. అయినప్పటికీ మార్పురాకపోతే, విచారణ జరిపి బాధ్యులకు మెమో జారీ చేస్తా. రోగులను ఎవరైనా డబ్బు అడిగితే వెంటనే మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. రోగులెవరూ డబ్బులు ఇవ్వవద్దు.

–డాక్టర్ సుభాష్, ఆస్పత్రి సూపరింటెండెంట్

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్ అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిలో ఏకాగ్రత చూపడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పది తరువాత ఏ కోర్సులు చదివితే ఉద్యోగ అవకాశాలు ఉంటాయో తెలుసుకోవాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలతో పాటు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని చెప్పారు. తన వంతుగా హైస్కూల్‌కు బేసిన్లు, ట్యాప్‌లు, పైప్‌లైన్‌కు సంబంధించి సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఉమాశంకర్‌ను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, ఉపాధ్యాయులు గోపి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హెటెరో ఆధ్వర్యంలో 'వాష్'పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం కుళ్లాయిరెడ్డి

నక్కపల్లి: వాటర్ అండ్ శానిటేషన్ హైజనిక్(వాష్) పేరుతో హెటెరో కంపెనీ యాజమాన్యం రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గురువారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని కంపెనీ జీఎంలు కుళ్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైనందిన జీవితంలో పరిశుభ్రమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత అనేది ఎంతో ప్రధానమన్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే అనారోగాల బారిన పడాల్సి వస్తుందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవడం అనేది మన చేతుల్లోనే ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల కోసం హెటెరో కంపెనీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందన్నారు.

శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజల భాగస్వామ్యం, శ్రద్ధ ఉంటేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్నిరంగాల్లోను రాణిస్తున్నారని చెప్పారు. తమ కంపెనీలో మహిళలకు కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. లోహెచ్ఎంలు రాణిలలిత, సుందరరావు, కంపెనీ సిబ్బంది అరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కిట్టయ్య చెరువులో కలప అక్రమ తరలింపు


కిట్టయ్యచెరువులో కలపను ట్రాక్టర్లపై తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో కాగిత గ్రామంలో ఉన్న కిట్టయ్య చెరువులో ఉన్న కలపను కొంత మంది కూటమి నాయకులు అక్రమంగా నరికి తరలిస్తున్నారు. ఈ చెరువులో లక్షలాది రూపాయల విలువైన తుమ్మ, కంచె, తదితర చెట్లు ఉన్నాయి. చెరువు పూడిక తీత పేరుతో కొంత మంది కూటమి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నరికించి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ఇలా నరికి తరలించిన కలపను విక్రయించి వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి చెందిన చెరువులో చెట్లను నరికించాలంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అనుమతి ఉండాలి. వాటిని నరికించి బహిరంగ వేలం నిర్వహించాలని, కానీ కూటమి నాయకులు మాత్రం అధికార అండదండలతో ఇష్టారాజ్యంగా నరికించి బహిరంగంగానే ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ దందాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపటి నుంచి ప్రజా చైతన్య యాత్రలు

అనకాపల్లి: జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం ఈ యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 24, 25 తేదీల్లో మండల కార్యాలయాల వద్ద మహాధర్నాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల అధ్యయనం కోసం జిల్లావ్యాప్తంగా పర్యటనలు జరగనున్నాయని, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తామని, కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో ప్రధానమైన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించాలని, ఉగాది నాటికి యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతి నెల రూ.1500 వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. బడ్జెట్లో రాయితీలు ఏమైనా ఇస్తారేమోనని తొమ్మిది మాసాలుగా ప్రజలు ఎదురు చూశారని వారి ఆశలు చంద్రబాబునాయుడు అడియాశలు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు తగ్గింపు ద్వారా వాటిని కుదించే ప్రయత్నం చేశారని, పీ4 పేరుతో 20 శాతం మంది లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, జీడి మామిడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, మత్స్యకారులకు వేట నిషేధ భృతి నేటికీ చెల్లించలేదని, స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. కృష్ణాపురం, లక్కవరం, రుక్మిణీపురం, జగనన్న కాలనీ, నాయనమ్మపాలెం గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

ఆశా వర్కర్లపై పోలీసుల నిర్బంధాలు దుర్మార్గం

అచ్యుతాపురం రూరల్ : ఆశా కార్యకర్తలపై పోలీసుల నిర్బంధాలు దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను ఇంటి వద్దే పోలీసులు నిర్బంధించడం అన్యాయమన్నారు. గృహ నిర్బంధం చేసి, అరెస్ట్ చేయడం హక్కులను హరించడమేనని చెప్పారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


తోటాడలో రక్షిత మంచినీటి పథకం పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస

మునగపాక: తోటాడ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస తెలిపారు. తోటాడ రక్షిత మంచినీటి పథకాన్ని ఆమె గురువారం పరిశీలించారు. హైస్కూల్ సమీపంలో ఉన్న ట్యాంకు మరమ్మతులకు గురికావడంతో కొండపై ఉన్న పథకం ద్వారా తాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, పెద్దలు దొడ్డి రమేష్, గొన్నాబత్తుల కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌లో జంపపాలెం విద్యార్థుల ప్రతిభ


ప్రాజెక్టులు రూపొందించిన జంపపాలెం విద్యార్థులు మోహన్ సాయి, వెంకటేష్

యలమంచిలి రూరల్: ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 2024–25కు సంబంధించి ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముత్యాల మోహన్ సాయి, బల్లా వెంకటేష్ రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ముత్యాల మోహన్‌సాయి డస్ట్ బిన్ మానిటరింగ్ సిస్టమ్, బల్లా వెంకటేష్ కారు యాక్సిడెంట్ ప్రివెన్షన్ పరికరాల నమూనాలను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇద్దరు విద్యార్థులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి


ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని, వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. అంగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిల్లో కిడ్నీ రోగులకు వైద్యం అందిస్తున్నారని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధుల వైద్యుడు లేకపోవడం అన్యాయమని, జిల్లా అస్పత్రిలో ఒక్క వైద్యుడినైనా నియమించే విధంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల నిరసన


మునగపాక ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మునగపాక: విద్యాశాఖలో కీలక సేవలందిస్తున్న 'సమగ్ర శిక్ష' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మునగపాక ఎంఈవో కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలియజేశారు. గతంలో సమ్మె కాలంలో ఒప్పందాలను అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు, హెచ్ఆర్ పాలసీలను వర్తింపజేస్తూ అసెంబ్లీలో ప్రకటన చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్లకార్డులను ప్రదర్శించారు. రెండో రోజు నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు పి.రామలక్ష్మి, కర్రి సత్యనారాయణ, బి.అచ్యుతకృష్ణ, జి.నూకేష్, ఎం.వీర అప్పారావు, ఆర్.సత్తిబాబు, ఎం.గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయండి


బీసీ కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: తడి, పొడి చెత్తల నిర్వహణతో చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. పలువురు మహిళలకు తడి, పొడి చెత్తల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటి వద్దే మహిళలు ముందుగా తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు.